క్లుప్తంగా

గాజువాక కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లు



విద్యార్థినికి అడ్మిషన్ పత్రం అందిస్తున్న హెచ్ఎం అరుణ్ కుమార్

గాజువాక: గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ అడ్మిషన్లను బుధవారం ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో తొలిరోజు ఆరుగురు విద్యార్థులు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు పొందారు. ఇంటర్ తరగతులను కూడా ప్రారంభించినట్టు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు తగిన పీజీటీలను ప్రభుత్వం నియమించిందని పేర్కొన్నారు.

పంచవటిలో రోడ్ల నిర్మాణానికి వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న పోవా ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం వద్ద గల పంచవటిలో రహదారుల నిర్మాణం చేపట్టాలని కోరుతూ పంచవటి హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పోవా) ప్రతినిధులు ఎమ్మెల్యే నాగిరెడ్డిని కోరారు. గురువారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పోవా అధ్యక్షుడు పి.చిన్నారావు, కార్యదర్శి రామ్మోహనరావు, మెంబర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరంలో ఉత్సాహంగా ఆటపాట



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

గాజువాక: గాజువాక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విభిన్న కార్యక్రమాలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళ ఆధ్వర్యంలో చిన్నారులకు ఖోఖో, చెస్ తదితర ఆటలను ఆడించడంతో పాటు వారితో పాటలను పాడించారు. డ్రాయింగ్ వేయించి ప్రతిభ ప్రదర్శించిన వారిని అభినందించారు. నీటి కథలను బోధించారు. అనంతరం యోగా గురు లీలా దుర్గ ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలు సాధన చేయించారు.

కరాటేలో ఉచిత శిక్షణ



శిక్షణలో పాల్గొన్న చిన్నారులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరడిమాంబ ఆలయం ఎదురుగా గల మైదానంలో గురువారం కరాటేలో ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. కరాటే కోచ్ బూస సుకన్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ తరగతుల్లో సుమారు 30 మంది స్థానిక చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని మెలకువలు నేర్చుకున్నారు. రన్నింగ్, ధ్యానం వంటి వాటిలో కూడా శిక్షణ ఇచ్చారు. అనంతరం పిల్లలకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. సుకన్య మాట్లాడుతూ తనకు తెలిసిన విద్య పది మందికి పంచాలన్న ఆలోచనలో భాగంగా కరాటే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ప్రతి రోజు ఉదయం 6 గంటలకు ఇక్కడికి వచ్చి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

అమ్మో.. స్పీడ్ బ్రేకర్లు

- హడలిపోతున్న ఉక్కు ఉద్యోగులు
- నడుము నొప్పులంటూ గగ్గోలు
- ప్రమాణాలకు విరుద్ధంగా వేశారని ఆరోపణ
- ఎత్తు తగ్గించాలని డిమాండ్



ఉక్కు జనరల్ ఆస్పత్రి కూడలి వద్ద ..



ఉక్కునగరం క్లబ్ ఎదురుగా ..



ఎత్తుగా ఉన్న స్పీడ్ బ్రేకర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రహదారిలో, టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన కొత్త స్పీడ్ బ్రేకర్లు ఉద్యోగులను హడలెత్తిస్తున్నాయి. స్పీడ్ బ్రేకర్లు వేసినప్పటి నుంచి రోజూ చిన్నా చితక ప్రమాదాలు జరగడంతో పాటు ఉద్యోగులకు ఆరోగ్య సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. స్టీల్ ప్లాంట్ ప్రధాన రహదారిలోని హిల్ టాప్ గెస్ట్‌హౌస్ కూడలి సమీపంలో, ట్రై వీక్లీ మార్కెట్ కూడలి, అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద, ఉక్కు జనరల్ ఆస్పత్రి ముందు, జనరల్ ఆస్పత్రి నుంచి అగనంపూడి వెళ్లే రహదారి కూడలి వద్ద కొంతకాలం క్రితం స్పీడ్ బ్రేకర్లు వేశారు. ఆయా ప్రాంతాల్లో వేగాన్ని నియంత్రించడం ద్వారా ప్రమాదాలు తగ్గించే లక్ష్యంతో స్పీడ్ బ్రేకర్లు వేశారు. స్పీడ్ బ్రేకర్లు వేయడం మంచిదే అయినా వీటిని వేసిన తీరుపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిలో, ప్రధాన రహదారుల్లో వేగాన్ని నియంత్రించేందుకు చిన్నపాటి ఎత్తుతో కూడిన స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నారు. అటువంటివి కాకుండా స్పీడ్ బ్రేకర్లను ప్రమాణాలకు విరుద్ధంగా, ఎత్తుగా వేయడం వల్ల ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరగడంతో ఆస్పత్రులకు వెళ్తున్నారు. నడుము నొప్పితో ఎక్కువ మంది బాధ పడుతున్నారు. ముఖ్యంగా అఖరి నిమిషంలో ప్లాంట్‌కు బయల్దేరే ఉద్యోగులు గేటు వేస్తారనే హడావుడిలో వాహనాల వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. కార్ల దిగువన ఉండే సైలెన్సర్‌కు స్పీడ్ బ్రేకర్లు తగులుతున్నాయంటే ఎంత దారుణంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, స్పీడ్ బ్రేకర్లను సరి చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

చాలా ప్రమాదకరంగా ఉన్నాయి



ఇటీవల స్టీల్‌ప్లాంట్‌లో వేసిన స్పీడ్ బ్రేకర్లు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. వాటి వల్ల ప్రమాదాలు జరగడంతో పాటు ఉద్యోగులకు వెన్నునొప్పులు వస్తున్నాయి. వెంటనే ఎత్తు తగ్గించాలి.

–ఎన్. రమేష్‌కుమార్, స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకుడు

వార్డుల్లో అభివృద్ధికి ప్రాధాన్యం



88వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

- సమస్యల సత్వర పరిష్కారం
- మేయర్ హరివెంకట కుమారి
- 87, 88 వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



యాతపాలెంలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డులో అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నామని చెప్పారు. 87వ వార్డులోని శ్మశానవాటిక వద్ద రూ.19.98 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, ప్రహరీ గోడ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. 88వ వార్డులోని యాదవజగ్గరాజుపేట శ్మశానవాటిక వద్ద రూ.43.30 లక్షలతో చేపట్టనున్న ప్రహరీ గోడ, బర్నింగ్ షెడ్ తదితర పనులకు ఎమ్మెల్యే నాగిరెడ్డితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి, అమలు చేస్తున్నారన్నారు. డైనమిక్ సీఎం నేతృత్వంలో నగరాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం, 87, 88 వార్డుల కార్పొరేటర్లు బొండా జగన్, ఎం. ముత్యాలు, ఆయా వార్డుల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిలు కోమటి శ్రీనివాసరావు, మహాలక్ష్మినాయుడుతో పాటు నాయకులు వాడపల్లి రామచంద్రరాజు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, బలిరెడ్డి నాగేశ్వరరావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, ముద్దపు దామోదర్, కోమటి రమాదేవి, దుగ్గపు దానప్పలు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా గాజువాక

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధిలో గాజువాకను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నానని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 64వ వార్డు యాతపాలెం కాలనీలో రూ.19.13 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, వెంకన్నపాలెంలో రూ.19.87 లక్షలతో సీసీ డ్రైనేజీల నిర్మాణాలకు గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో ఇప్పటికే సీసీ రోడ్లు, కాలువలు, మంచినీటి పైపులు, విద్యుత్ దీపాలు వంటి పనులు చేపట్టి పూర్తి చేశామన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీ పేదవారికి అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజా సమస్యలపై వార్డు నాయకులు ప్రజలకు చేరువగా వెళ్తూ అభివృద్ధి పనులను చేపట్టడం సంతోషదాయకమన్నారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్సీ పి.సింహాచలం, నాయకులు సంపంగి పార్వతి, పితాని అన్నవరం, సంపంగి ఈశ్వరరావు, సంపంగి అప్పలనాయుడు, తిప్పల గోపీ, ధర్మాల హరీష్, నక్కా రమణ తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో రూ.49 లక్షలతో కైలాసభూమి అభివృద్ధి

అగనంపూడి: జీవీఎంసీ పరిధిలో శ్మశానవాటికల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తూ నిధులు కేటాయిస్తున్నామని మేయర్ హరివెంకట కుమారి అన్నారు. 79వ వార్డు అగనంపూడి శ్మశానవాటికలో రూ.49 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పూర్ణానంద శర్మ, నాయకులు అప్పికొండ మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణతో కార్మికులకు నష్టం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో కార్మికుల సంక్షేమానికి నష్టం వాటిల్లుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో ఎదుర్కోవాలని సూచించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 840వ రోజు, గురువారం సంస్థకు చెందిన ఎస్ఎంఎస్–1 విభాగం కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సంపదను కారుచౌకగా కట్టబెడితే మౌలిక సదుపాయాల కల్పనలన్నీ కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయి ప్రజలపై పన్నుల భారాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వరంగ సంస్థలను అభివృద్ధి చేసి, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలను దండుకుని ప్రజలను అణచివేస్తారని విమర్శించారు. అందుకే విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. లేదంటే రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ



దివ్యాంగుడికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ ప్రవీణ్ కుమార్

అక్కిరెడ్డిపాలెం: నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ గురువారం ఉత్సాహంగా సాగింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో దివ్యాంగుడు డి.పోతారావుకు వలంటీర్ ప్రవీణ్ కుమార్, కన్వీనర్ నేలపాటి సత్యవతి పెన్షన్ పంపిణీ చేశారు.

కార్మికులకు శ్వాసకోశ వ్యాధులపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న మెడికవర్ ఆస్పత్రి వైద్యులు, వీ సెజ్ అధికారులు

అగనంపూడి: పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు ఊపిరితిత్తులు, శ్వాస సంబంధిత వ్యాధులపై గురువారం అవగాహన కల్పించారు. దువ్వాడ వీ సెజ్, మెడికవర్ ఆస్పత్రి సంయుక్తంగా, వీ సెజ్ పరిపాలనా విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడారు. పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు సూచించిన సలహాలు పాటించడం ద్వారా ఆరోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చన్నారు. కార్యక్రమంలో జేడీసీ రోహిణి అపరంజి, ఏడీసీ శ్రీనివాసరావు, ఆస్పత్రి పల్మనాలజిస్ట్ సత్యపద్మజ, కులదీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ టింపనీ ఫీడర్, 11 కేవీ నోవాస్ ఫీడర్, 33/11 కేవీ జగ్గు సెంటర్ ఎస్ఎస్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రగతిపార్కు ఏరియా, టింపనీ స్కూల్ ఏరియా, ఆదర్శ్ గ్రౌండ్, గాంధీనగర్, నోవాస్ అపార్ట్‌మెంట్, రామచంద్రనగర్, కర్ణవానిపాలెం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

మలేరియా మాసోత్సవాలు ప్రారంభం



మలేరియా అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

గాజువాక: గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా దోమ తాజా నీటిలో గుడ్లు పెట్టి వృద్ధి చెందుతుందని, అందువల్ల నీటి నిల్వలకు సంబంధించిన పాత్రలపై తప్పకుండా మూతలు ఉండాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. డాక్టర్ బద్రి నారాయణ మాట్లాడుతూ దోమలను లార్వా దశలో నాశనం చేయడం సులువని, అందువల్ల ప్రజలందరూ తమ ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు పద్మ, గీతా ప్రియదర్శిని, సీహెచ్‌వో నాగ అప్పారావు, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ల అభివృద్ధికి కృషి



మర్రిపాలెం రైతుబజార్‌లో సమస్యలు పరిశీలిస్తున్న సీఈవో నందకిషోర్

గోపాలపట్నం: నగరంలోని అన్ని రైతుబజార్ల అభివృద్ధికి క్షేత్ర స్థాయిలో సమీక్షిస్తున్నామని రాష్ట్ర రైతు బజార్ల ముఖ్య కార్యనిర్వాహక అధికారి(సీఈవో) ముల్లంగి నందకిషోర్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం మర్రిపాలెం రైతుబజార్‌లో ఆయన పర్యటించి రైతుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో రైతుబజార్ల ఈవో తెలిపిన సమస్యలపై ఆరాతీశారు. విద్యుత్ వైరింగ్, లైట్లు, రైతుబజార్ల వెనుక వైపు కాంపౌండ్ వాల్, బజారు ముఖద్వారం, మరుగుదొడ్ల నిర్మాణం, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం, ఫ్లోరింగ్ మరమ్మతులు, సీసీ కెమెరాలు ఏర్పాటు వంటి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ రైతుబజార్‌లో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు చేపడతామని తెలిపారు. రైతులు, వినియోగదారులకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జిల్లా వ్యవసాయ వాణిజ్య అధికారి షేక్ యాసిన్, డీఈ కెనడీ, మర్రిపాలెం రైతుబజార్ ఈవో కె.వరహాలు, సహాయకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

పెదగంట్యాడ: ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ముసలినాయుపాలెంలో పేదలకు చీరలు, నిత్యావసర సరకులను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ సాహసోపేత నిర్ణయాలు, సంక్షేమ పథకాలను నియోజకవర్గంలోని 20 వార్డుల్లో నెలరోజుల పాటు ప్రచార రథం ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కోన చినఅప్పారావు, ములకలపల్లి ప్రకాష్, డాక్టర్ శ్రీనివాసరావు, ప్లీడర్ కరణం కళావతి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు సహకరించండి

సచివాలయాల సిబ్బందితో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్



మాట్లాడుతున్న చైర్మన్ కేసలి అప్పారావు

సీతమ్మధార: రాష్ట్రంలోని గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది యావత్తు భాగస్వాములై బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం కోరారు. సీతమ్మధారలో గురువారం 14, 15, 16 వార్డుల సచివాలయాలకు చెందిన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి ఆఖరి వరకు రాష్ట్ర స్థాయిలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా అన్ని ప్రభుత్వ విభాగాలు, శాఖల అధికారిక యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో కలిసి సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఈ తరుణంలో సచివాలయం సిబ్బంది పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలన్నారు. బడి బయట ఉన్న బాలలను గుర్తించి తిరిగి స్కూల్‌లో చేర్పించాలని చెప్పారు. ఆరోగ్య కార్యకర్తలు తరచూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలలకు వైద్య పరీక్షలు, రక్తహీనత లేకుండా జాగ్రత్తలు పాటించేలా చూడాలని సూచించారు. దివ్యాంగ బాలలకు పెన్షన్ల జారీ, పాఠశాలల్లో చేర్పించేలా చర్యలకు యుద్ధప్రాతిపదికన ఆదేశాలు జారీ చేశారు. సమతుల్య పౌష్టికాహారాన్ని అందించే ప్రభుత్వ వ్యవస్థల పనితీరుపై డేగ కళ్లతో పర్యవేక్షించాలని సూచించారు. రెవెన్యూ కార్యదర్శులంతా విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ, ఇతర ధ్రువ పత్రాల జారీలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, సచివాలయ ప్రతినిధులు బి.మహాలక్ష్మి, కె.వి.సాయిశ్రావణి, ఎస్.శిరీష, వి.వెంకటలక్ష్మి, వి.శ్యామల, వై.మంగ, బి.సతీష లావణ్య, హేమలత, ఆది, సోంబాబు, జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

జీర్ణకోశ సమస్యల నివారణకు ప్రత్యేక శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో జీర్ణకోశ సంబంధ వ్యాధుల నివారణకు ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3వ తేదీ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్‌రోడ్డులోని యోగా కేంద్రంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. విశ్రాంత ఆయుర్వేద వైద్యుడు కె.ఈశ్వరరావు స్వయంగా రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలు సూచించనున్నారు. తీవ్ర అనారోగ్య కలిగిన వారు తమ వైద్య పరీక్షలు రిపోర్టులను తీసుకురావాలని సూచించారు.

10న భెల్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికలు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలను ఈ నెల 10న నిర్వహించనున్నట్లు సంస్థ డీజీఎం (హెచ్ఆర్), ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.పి.మిశ్రా తెలిపారు. అదే రోజు సాయంత్రం ఎన్నికల ఫలితాలు వెలువడతాయన్నారు. అధ్యక్షుడు–1, కార్యనిర్వాహక అధ్యక్షుడు–1, ఉపాధ్యక్షులు–2, ప్రధాన కార్యదర్శి–1, సంయుక్త కార్యదర్శి–1, అసిస్టెంట్ సెక్రటరీ–2, కోశాధికారి–1 పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయని, గురువారం నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలియజేశారు.

శ్మశానవాటికలో ముమ్మరంగా పనులు



శ్మశానవాటిక పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు చిన్నపాలెంలోని శ్మశానవాటికలో ప్రహరీ సమస్యపై జీవీఎంసీ అధికారులు స్పందించారు. కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి ఆధ్వర్యంలో సిబ్బంది కైలాసభూమి సరిహద్దులను జేసీబీతో చదును చేస్తున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రసవత్తరంగా చదరంగం పోటీలు



చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో నిర్వహిస్తున్న చదరంగం శిక్షణలో భాగంగా గురువారం విభాగాల వారీగా విద్యార్థులకు పోటీలు ఏర్పాటు చేశారు. కోచ్ ఉమాపతి పర్యవేక్షణలో జరిగిన పోటీల్లో బాల, బాలికలు ఎంతో నైపుణ్యం ప్రదర్శించారు. ఈ పోటీలు రౌండ్ల వారీగా నిర్వహిస్తున్నందున శుక్రవారం కూడా శిక్షణ పొందిన విద్యార్థులకు పోటీలు కొనసాగనున్నాయి విజేతలకు జ్ఞాపికలు, శిబిరంలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు శనివారం సాయంత్రం 6 గంటలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరగనుంది. అనంతరం రాత్రికి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు తల్లిదండ్రులు, విద్యార్థులు తప్పక హాజరు కావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. శిబిరం ఏర్పాట్లను కార్యవర్గ సభ్యులు, క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి సుధాకర్ తదితరులు పర్యవేక్షించారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పల్లా

పెదగంట్యాడ: 75వ వార్డు చినకోరాడలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా గురువారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు టీకేటి అప్పారావు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, పులి వెంకటరమణా రెడ్డి, టీకేటి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.